


ఓ రోజా
కథ
దీదువాను
లక్ష్మజీ




నల్లని మేఘాలు ఆకాశం అంతా దట్టంగా అలుముకొని ఉన్నాయి 'ఇప్పట్లో తగ్గేలా లేదీ వెధవవర్షం అనుకుంటూ విచారంగా ఆకాశంవైపు చూస్తోంది సరోజ। "రెండు రోజుల నించి ఎడతెరిపి లేకుండా కురుస్తోందీ వర్షం। బాబుని చూస్తే భయం వేస్తోంది। వర్షం తగ్గితే హాస్పిటల్‌కి తీసుకువెడదాం అని చూస్తోంటే, ఎంతకీ తగ్గదేమిటి?" అని చిన్నగా నిట్టూర్చింది।

బాబు మంచం దగ్గరికివచ్చి బాబుకేసి చూస్తూ కూర్చుంది "నాలుగు రోజులుగా విపరీతంగా జ్వరంగా ఉంది బాబుకి జ్వరంతో ఒళ్ళు సలసలామని కాలుతోంది అక్కడికీ మొదటినించీ ఆసుపత్రికి తీసుకువెళుతున్నా, ఎక్కడా తగ్గుముఖం పట్టలేదు। ప్రయివేటు డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళి, మంచివైద్యం చేయించడానికి, తగిన స్థోమతలేదాయె। జనరల్ ఆసుపత్రికి తీసుకువెడితే సరిగ్గా పరీక్షించకుండానే, రంగునీళ్ళు పోసిస్తున్నాడా డాక్టరు। ఏమీ గుణం కనిపించడంలేదు। ఈ రోజున పోనీ అవి పోయిద్దాం అన్నా, హాస్పిటల్‌కి వెళ్ళనివ్వకుండా పొద్దునటించీ వర్షం। రిక్షాలోవెడదాం అంటే, ఉన్న రూపాయి రిక్షాకు పెడితే, ఈ నెలాఖరులో నాకు అప్పు ఎవరిస్తారు? మిగతా రోజులు ఎలా గడుస్తాయి। రెండు రోజులుగా బ్రెడ్ తిని, మంచినీళ్ళతో పొట్టనింపుకుంటున్నా, మిగతా వారం రోజులు గడపటం ఎలాగో తెలియడంలేదు.

ఆయన అర్ధాంతరంగా పోవటంకాదు గానీ, బ్రతుకంతా దుర్భరమైపోయింది బాబుమీదే ఆశలన్నీ పెట్టుకుని, జీవితాన్ని వచ్చే వందరూపాయల పెన్షన్‌తో వెళ్ళదీస్తున్నాను। ఆ ఆశే లేకపోతే, ఏనాడో, ఆయనతోబాటు నా జీవితానికి కూడా స్వస్తి చెప్పేదాన్ని।"

ఆలోచనంలో మునిగివున్న సరోజ, పక్క వాటాలో గడియారం గంట కొట్టడంతో మెలుకువ తెచ్చుకుంది "అరే। అప్పుడే నాలుగున్నర అయ్యిందే। అయిదయితే, డాక్టరు వెళ్ళిపోతాడు। వర్షం యింకా తగ్గలేదు। ఏం చెయ్యడం?" అనుకుంటూ బాబు వంటిమీద చెయ్యివేసి చటుక్కున లాక్కుంది। వేడిగా కాలింది చెయ్యి। 'రేపు సంగతి దేముడెరుగు। ముందు బాబుని హాస్పిటల్‌కి తీసుకువెళ్లాలి। అని వెంటనే లేచి జంక్షన్‌లోవున్న రిక్షాని పిలిచి బేరమాడింది రూపాయికి తక్కువ రానన్నాడు వాడు। కానీలెమ్మని, బాబుని జాగ్రత్తగా దుప్పటిలో చుట్టి, ఎత్తుకుని, ఇంటికి తాళంవేసి బయలుదేరింది।

* * *

ఆసుపత్రిలో అడుగుపెట్టేసరికి, పది నిముషాలు తక్కువ అయిదుఅయ్యింది టైము। డాక్టరు ఫోనులో ఎవరితోనో మాట్లాడుతున్నాడు కబుర్లుకట్టిపెట్టి, ఫోను పెట్టేసరికి అయిదు దాటనే దాటింది

సరోజని చూడనట్టుగానే, గబగబా కాగితాలు సర్దుకుంటున్నాడు వెంటనే గదిలోకి అడుగుపెట్టి,

"డాక్టరుగారూ। బాబుకి జ్వరం చాలా ఎక్కువగా ఉందండీ। నాలుగు రోజులుగా మందులు వాడుతున్నా తగ్గలేదు। ఒక్కసారి చూడరూ।" అంది బాబు మీద కప్పిన దుప్పటీ తీస్తూ।

"ఇంత ఆలస్యంగా వస్తే ఎలాగ? టైము అయిపోయింది రేపు రా।" నిర్లక్ష్యంగా అన్నాడు।


"లేదు డాక్టర్। బాబు పరిస్థితి చూస్తే భయంవేస్తోంది ఒక్కసారి చూడండి డాక్టర్। ప్లీజ్।" దీనంగా వేడుకొంది

"ఇప్పుడు ఏం లాభంలేదు। టయిమంటే టయిమే। నీ వెనక ఇంకోళ్ళు వస్తారు। అందరికీ యిలాగే చూస్తూ కూర్చుంటే అవతల నాపనులన్నీ పాడవుతాయి కావాలంటే నా నర్సింగ్‌హోమ్‌కి రా యిప్పుడు। అక్కడ చూస్తాను।" అంటూ వెళ్ళిపోయాడు డాక్టరు।

నిస్సహాయంగా నిలబడిపోయింది సరోజ। కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి

"వెళ్ళవమ్మా వెళ్లు। మేము తలుపులు వేసుకొని, ఇంటికి వెళ్లాలి।" అంటూ నర్సు బయటికి తరిమింది

నర్సునడిగి, డాక్టరుగారి హాస్పిటల్ ఎక్కడో తెలుసుకొని, అటువైపు నడిచింది అదృష్టవశాత్తు వర్షం చాలావరకు తగ్గింది సన్నగా జల్లు పడు




తోంది అలాగే గబగబా నడుచుకుంటూ హాస్పిటల్‌ని చేరుకుంది బాబుకి దట్టంగా దుప్పటి కప్పటంవల్ల, ఏం అవ్వలేదు కానీ, సరోజ మాత్రం పూర్తిగా తడిసి పోయింది తడిచీర వంటికి అతుక్కుపోతోంది

లోపలికి అడుగుపెట్టి, డాక్టరు గదికేసి చూసింది. డాక్టరు ఉన్నారు ఏవో కాగితాలు చూసుకుంటున్నాడు. కాంపౌండరు పక్కనవున్న వరండాలో సిగరెట్ కాల్చుకుంటున్నాడు.

గదిలోకి అడుగుపెట్టిన సరోజని చూసి, ఒక్కక్షణం విసుగు తాండవించిందా డాక్టర్ ముఖంలో. కానీ మరుక్షణంలో ఆమె పేదతనాన్ని అంచనా వేసినకళ్ళు, బుర్రలో మెరిసిన ఒక ఆలోచనకి తళుక్కుమన్నాయి "రా! ఇలా తీసుకురా బాబుని!" అని బెడ్‌మీద బాబునివుంచి, పరీక్షించాడు. నిజమే బాబు పరిస్థితి తీవ్రంగానే ఉంది సరియైన మందులు అరగంటలోగా పడకపోతే, ప్రాణం నిలుస్తుందన్న నమ్మకం లేదు. హై టెంపరేచరు ఉంది. బరువుగా తీస్తున్నాడు ఊపిరి.

"మందులు రాసిస్తాను. కొని పట్టుకు వస్తావా?" అన్నాడు

క్షణం తటపటాయించి "నా దగ్గిర డబ్బేమీలేదు డాక్టర్. నెలాఖరుఅవ్వడం వల్ల అప్పు పుట్టడంకూడా కష్టమే" అంది మెల్లిగా తలవంచుకొని.

"నన్నేం చెయ్యమంటావు ఇప్పుడు? బాబు మందులకి కనీసం పదిహేను

రూపాయిలైనా అవుతాయి నా ఫీజు పది రూపాయలు పాతిక రూపాయిలైనా కావాలిప్పుడు! బాబుకి చాలా ఎక్కువగా ఉంది జ్వరం! అరగంటలో మందులు పడకపోతే ప్రాణం నిలుస్తుందని చెప్పలేను" అన్నాడు!

బాబు పరిస్థితి తెలిసేసరికి సరోజకి ఏడుపు వచ్చేసింది "ప్లీజ్ డాక్టర్! బాబుని ఎలాగైనా రక్షించండి! ఫస్ట్ రాగానే మీ డబ్బు తీసుకువచ్చి యిచ్చేస్తాను" అంటూ ఏడిచేసింది!

అతని కళ్లు ఎరుపెక్కుతున్నాయి ఆమెని చూస్తూవుంటే! తడిసిన చీరలో, ఆమె వంటి సోయగాన్ని తిలకిస్తూ, "ఓ పని చెప్తాను చేస్తావా? నువ్వు ఫీజు, మందులకి డబ్బుయివ్వక్కరలేదు! !" అంటూ ఆమెకేసి చూశాడు!

ఆశతో తలయెత్తిన సరోజకి, అతని చూపులలో ని వేడి, కోరిక, అర్థం అయ్యాయి అతను ఏం చెప్పబోతున్నాడో తెలిసిపోయింది ఆవేశం కలిగింది, కోపంతో! కానీ, తమాయించుకుంది

ఆమె తన ఆలోచన, కోరిక కని పెట్టిందన్న సంగతి అతను అర్థంచేసుకున్నాడు! ఏమీఅనలేదు కాబట్టి,ధైర్యం చేసి "బాబుని రక్షించే బాధ్యత నాది! జ్వరం తగ్గేవరకు నేను జాగ్రత్తగా చూస్తాను" అంటూ భరోసా ఇచ్చాడు!

తాను చిక్కుకున్న నిస్సహాయ పరిస్థితి తల్చుకునేసరికి బాధతో గుండెలు బరువెక్కాయి ఒకవైపు ప్రాణసమానమైన తన 'ఒక్కగానొక్క బాబు! తన ఆశాదీపం! తన కంటివెలుగు! మరోవైపు ఆడదానికి అతి ముఖ్యమైన ప్రాణప్రదమైన శీలం! రెండింటిలో దేనినో ఒకదానిని వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది! ఇదా! అదా! భగవాన్! ఎంతటి విషమ పరిస్థితి కల్పించావు!" అంటూ మౌనంగా రోదించింది


'సరూ? నా వంశం నిలపవూ!" అంటూ చివరి ఘడియల్లో తనని వేడుకున్న భర్తముఖం దీనంగా కదలాడింది కళ్ళముందు!

ఒక నిర్ణయానికి వచ్చి, "మీ యిష్టం డాక్టర్! ముందర బాబుని రక్షించండి!" అంటూ తలవంచుకుంది టపటపా రాలిపడ్డాయి కన్నీళ్ళు నేలమీద!

"ఏడవకు! బాబుకేం ఫర్వాలేదు!" అని కాంపౌండర్‌ను పిలిచి, డబ్బుతీసిచ్చి కావాల్సినమందులురాసిచ్చి, "త్వరగా ఈ మందులు కొనిపట్రా! వచ్చిన వెంటనే ఇంజక్షన్ యివ్వు బాబుకి!" అని అతన్ని బయటికి పంపి తలుపులు దగ్గరకి వేశాడు

* * *


సన్నజల్లులో రోడ్డెక్కిన కాంపౌండరు విసుక్కుంటూ రెండు ఫర్లాంగుల




దూరంలోవున్న మందులషాపు వైపు నడిచాడు తీరాచేసి అదికాస్తా మూసి వుంది "అరే! ఇది మూసివుందే! ఎలా ఇప్పుడు? మెయిన్ రోడ్ వరకూ వెళ్లాల్సిందే! తప్పదు!" అని తిట్టుకుంటూ మెల్లిగా మెయిన్ రోడ్ చేరి, మందులు కొని వస్తూవుంటే, స్నేహితుడు కనిపించి "కాఫీ త్రాగుదాం రారా!" అంటూ హోటల్ కి తీసుకువెళ్లాడు కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు! మందులు పట్టుకువెళ్ళి యివ్వాలన్న జ్ఞాపకంవున్నా సాధారణంగా డాక్టరు తనని ఎందుకు బయటికి పంపిస్తాడో తెలుసుగనక లేట్ అయినా ఫర్వాలేదని మెల్లిగా బయట పడేసరికి నలభై అయిదు నిముషాలు దాటింది! హాస్పిటల్ వైపు అడుగులు వేశాడు!

* * *

తన కోరిక పూర్తిగా తీర్చుకుని, ప్రక్కగదిలోనించి బాబు ఉన్నగదిలోకి అడుగుపెట్టాడు డాక్టరు! బాబు పరిస్థితి చూద్దాం అని దగ్గరికి వెళ్ళి వంటిమీద చెయ్యివేసిన డాక్టర్, అదిరిపడ్డాడు! చల్లగా తగిలింది బాబు ఒళ్ళు! బాబు ప్రాణం, అనంతవాయువుల్లో కలిసి పోయింది అని తెలిసేసరికి, ఒళ్ళంతా చమటలు పట్టాయి బాబు ముఖంమీద గుడ్డకప్పి, కుర్చీలో కూర్చుని, "ఇప్పుడు ఎలా? సరోజకి నాముఖంఎలాచూపించను? ఎప్పుడనగాపంపించానుఆకాంపౌండరుని!




వచ్చి యింజక్షన్ చెయ్యమంటే, యింతవరకు రాలేదు। ఎలాగ యిప్పుడు। ఎలా !" అంటూ తల పట్టుకు కూర్చున్నాడు।

గదిలోకి అడుగుపెట్టిన సరోజ బాబు కేసి చూసింది తెల్లగుడ్డ వెక్కిరించింది। బాబు తనకిక లేడని అర్థంచేసుకునే వరికి దుఃఖం కట్టలు త్రెంచుకుంది అంతకన్నా ఎక్కువగా ఆవేశం, కోపం కలిగాయి। డాక్టరుమీద చెప్పలేనంత కసి, వగ। సరోజకి ముఖం చూపలేక, తల దించుకుని కూర్చున్న డాక్టరు వెన్నులో 'కసుక్కున' దిగింది కత్తి। వరసగా నాలుగు పోట్లు పొడిచింది "అమ్మా!" అంటూ అరిచి, టేబులుమీద వాలి పోయాడు ఆ డాక్టరు।

"చంపేశాను। ఒక నరరూప రాక్షసుణ్ని చంపేశాను। నా బాబుని బలితీసుకున్న దుర్మార్గుణ్ణి చంపేశాను।" అని గట్టిగా నవ్వి, ఆ కత్తితోనే తాను కూడా పొడుచుకుంది బలంగా। బాబు పక్కమీద వాలిపోయి, "నిన్ను చంపిన ఆ దుర్మార్గుడిని అంతంచేసి నా పగ తీర్చుకున్నాను బాబూ। నా మానంకన్నా ఎక్కువ విలువ నీకు యిచ్చి, నిన్ను రక్షించబోయి, పూర్తిగా మోసపోయాను। ఇక నిన్ను, నన్ను ఎవ్వరూ వేరుచెయ్యలేరు బాబూ। నేను నీ దగ్గరకి వచ్చేస్తున్నాను। వచ్చేస్తున్నాను బాబూ।" అంటూ తల వాల్చేసింది।

గదిలో అడుగుపెట్టిన కాంపౌండరు గదిలోని దృశ్యాన్ని చూసి అచేతనుడై పోయాడు। అర్థంచేసుకుని, డాక్టరు పరిస్థితిని చెయ్యి పట్టుకుని చూసి చెయ్యగలిగింది ఏమీలేదని వదిలేశాడు।